క్లుప్తంగా

కార్తిక స్నానాలకు ఏర్పాట్లు పూర్తి



ఫిరంగిపురం: మండలంలోని వేమవరం గ్రామంలోని కోటి ఒక్క లింగాల క్షేత్రంలో కార్తిక మాసాన్ని పురస్కరించుకొని భక్తులకు స్నానాలు చేసేందుకు వీలుగా ఏర్పాట్లు చేసినట్లు ఆలయ నిర్వాహకులు లక్ష్మీనారాయణ మంగళవారం తెలిపారు. ఆలయ పరిసరాల్లోని ఈశాన్య భాగం వద్ద ఉన్న బావికి గిలకలు ఏర్పాటు చేసి స్నానాలు చేసేందుకు వీలుగా పొక్లెయిన్‌తో పనులు చేయిస్తున్నట్లు చెప్పారు. సమీపంలోని మరకత లింగానికి భక్తులు తమ స్వహస్తాలతో అభిషేకాలు నిర్వహించేలా ఏర్పాటు చేశామన్నారు. మరకతలింగానికి చుట్టూ గోడలు ఏర్పాటు చేసి కుటీరం ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. వచ్చే నెల 2 నుంచి కార్తిక మాసం ప్రారంభం కానుండటంతో భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలుగకుండా అమ్మచారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ బాబా ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు.

ఎట్టకేలకు రిటైనింగ్ వాల్ నిర్మాణం



తాడేపల్లిరూరల్ : కృష్ణానది దిగువ ప్రాంతంలో పుష్కర ఘాట్‌కు వెళ్లే మార్గంలో పలుచోట్ల కృష్ణానది ఒడ్డున రిటైనింగ్ వాల్ కూలిపోయింది. ఈ గోడ కూలిపోవడంపై అనేకసార్లు పత్రికల్లో వార్తలు వచ్చినా అధికారులు స్పందించలేదు. గత నెల రోజుల క్రితం వరదలు వచ్చిన సమయంలో మరోచోట గోడ కూలడంతో ఎట్టకేలకు ఇరిగేషన్ అధికారులు స్పందించి మంగళవారం రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులను చేపట్టారు. రిటైనింగ్ వాల్ వెయ్యి మీటర్ల ఉంది. అందులో సుమారు 100 మీటర్ల వరకు పలుచోట్ల కూలిపోవడంతో ఆ నిర్మాణ పనులను చేస్తున్నట్లు ఇరిగేషన్ శాఖ అధికారులు తెలిపారు.

సమైక్యతే సమతకు సోపానం



తాడేపల్లిరూరల్ : భారతీయులం అనే భావనతో జీవించాలని ఏపీ హైకోర్టు ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ మన్నవ శ్రావణ కుమార్ అన్నారు. వడ్డేశ్వరం కేఎల్ విశ్వవిద్యాలయంలో మంగళవారం నిర్వహించిన సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి, రాష్ట్రీయ ఏకతా దివస్ ఉత్సవాల కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని రాష్ట్రీయ ఏకతా దివస్ ప్రాధాన్యాన్ని వివరిస్తూ ప్లకార్డులతో ప్రదర్శనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ వీసీ డాక్టర్ జి. పార్థసారథి వర్మ, ప్రో వైస్ చాన్సలర్ డాక్టర్ ఎవిఎస్ ప్రసాద్, రిజిస్ట్రార్ డాక్టర్ కె. సుబ్బారావు, ఎంహెచ్ఎస్ విభాగం డీన్ ఆచార్య ఎం. కిషోర్‌బాబు, విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి డాక్టర్ కెఆర్ఎస్ ప్రసాద్, బిఎ (ఐఎఎస్) విభాగం అధిపతి డాక్టర్ బి. శివనాగయ్య, బిఎ (ఐఎఎస్)విభాగం ఉప అధిపతి డాక్టర్ కె. అనీల్ కుమార్, కార్యక్రమ కన్వీనర్లు తదితరులు పాల్గొన్నారు.

రోడ్లపై వ్యర్థాలు లేకుండా చూడాలి

అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతి

తెనాలిఅర్బన్: రోడ్లపై వ్యర్థాలు లేకుండా చూడాలని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వి.ఎం.లక్ష్మీపతి సూచించారు. పట్టణంలోని 4వ శానిటరీ డివిజన్ కార్యాలయాన్ని మంగళవారం తనిఖీ చేశారు. అటెండెన్స్ పరిశీలించారు. అనతంరం పలు వార్డుల్లో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యర్థాల నిర్వహణపై పలు విమర్శలు వినిపిస్తున్నాయని, అలాంటివి రాకూండా చూసుకోవాలని తెలిపారు. ప్రతిరోజు చెత్త సేకరణను చేయాలని ఆదేశించారు. ఆయన వెంట పలువురు సచివాలయం, మున్సిపల్ ఉద్యోగులు ఉన్నారు.

క్రీడాస్ఫూర్తి కలిగి ఉండండి



తెనాలిఅర్బన్: క్రీడాస్ఫూర్తి అందరూ కలిగి ఉండాలని టుటౌన్ ఎస్ఐ షరీఫ్ పేర్కొన్నారు. బుర్రిపాలెం రోడ్డులోని భాష్యం స్కూల్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన క్రీడలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల ద్వారా మానసిక ఉల్లాసం లభిస్తుందని చెప్పారు. అలాగే క్రీడల్లో రాణిస్తే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ రాము, వైస్ ప్రిన్సిపల్ మోహన్‌దాస్, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక ప్రాంతంలో మద్యం గుబాళింపు

- మద్యం సేవనానికి అనువుగా కృష్ణా తీరం
- మద్యం సీసాలు, వ్యర్థాలతో నిండిపోయిన పుష్కర ఘాట్
- పగిలిన మద్యం సీసాలతో భక్తులకు, మత్స్యకారులకు గాయాలు
- మత్తులో భక్తులతో అసభ్య ప్రవర్తన
- ఆగడాలకు అడ్డుకట్ట వేయాలంటున్న స్థానికులు
- సీసీ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేయాలని భక్తుల విన్నవం

సందర్శకులు, భక్తులతో ఆధ్యాత్మికత ఉట్టిపడే కృష్ణాతీరం.. మందు బాబుల సిట్టింగ్‌లకు, మద్యం వ్యర్థాలకు నిలయమైంది. నూతన మద్యం విధానంతో భక్తులకు, మత్స్యకారులకు వీరి బెడద ఎక్కువైంది. పుణ్య స్నానాలు ఆచరించే పుష్కర్ ఘాట్‌లో..మద్యం ఘాటు గుబాళిస్తోంది. మద్యం బెల్ట్ షాపులు కూడా ఊపందుకోవడంతో.. పర్యాటక ప్రాంతం పగలు, రాత్రి తేడా లేకుండా సురాపానానికి పర్యాయ ప్రాంతంగా మారింది.



పుష్కర ఘాట్‌లో ఉన్న సీసా పెంకులు



పుష్కర ఘాట్‌లో పేరుకుపోయిన వాటర్ ప్యాకెట్లు, ఇతర వ్యర్థాలు

తాడేపల్లిరూరల్ : మంగళగిరి నియోజకవర్గ పరిధిలో కృష్ణా తీరం ఎక్కువగా ఉంది. మందు బాబులు తీరంలోని పలు ప్రాంతాలను మద్యం సిట్టింగ్‌కు కేంద్రాలుగా మార్చుకున్నారు. పగలు, రాత్రి తేడా లేకుండా మద్యం సేవిస్తున్నారు. కృష్ణా తీరంలో పుణ్య స్నానాలు ఆచరించడానికి వచ్చే భక్తులు మందు బాబులను చూసి భయభ్రాంతులకు గురవుతున్నారు. తాగిన మద్యం సీసాలను కొంత మంది నది నీటిలోకి విసిరివేయడం, సీసాలను పగలకొట్టి ఇసుకలోకి విసిరివేయడంతో మత్స్యకారులకు, సందర్శకులకు కాళ్లలో సీసా పెంకులు గుచ్చుకుంటున్నాయి. కృష్ణానది ఎగువ ప్రాంతంలోని మత్స్యకారులు బోటులు నిలిపే ప్రాంతంలో మత్స్యకారులు నీళ్లలోకి దిగిన సమయంలో కాళ్లకు సీసా పెంకులు గుచ్చుకుని, తీవ్రంగా గాయపడుతున్నారు.

ఆధ్యాత్మికంలో..మద్యం కంపు

ప్రకాశం బ్యారేజ్ దిగువ ప్రాంతమైన సీతానగరం ఆధ్యాత్మికతకు ఎంతో ప్రసిద్ధి గాంచింది. ఇక్కడ ఉన్న ఆంజనేయస్వామి దేవస్థానంలో భక్తులు భక్తి శ్రద్ధలతో కృష్ణా నదిలో స్నానాలు ఆచరించి పూజలు చేస్తారు. ఎవరైనా బంధువులు మరణించిన సమయంలో దేవస్థానంలో నిద్ర చేస్తారు. ప్రతిరోజు నిద్ర చేసేందుకు భక్తులు వస్తూనే ఉంటారు. తెల్లవారుజామున 3 గంటలకు నిద్ర లేచి కృష్ణా నదిలో పుణ్య స్నానాలు ఆచరించి, ఆంజనేయ స్వామి దేవస్థానం, రామాలయం, శివాలయంలో పూజలు నిర్వహిస్తారు. అనంతరం వారికి అంటు తొలగినట్లు భావిస్తారు. తెల్లవారు జామున స్థానికంగా ఉన్న బెల్ట్ షాపుల్లో మద్యం తీసుకుని కొంత మంది ఆటో వాళ్లు, ఇతరులు ఆ పుష్కర ఘాట్లలో స్నానాలకు వెళ్లే మెట్లపై కూర్చుని మద్యం సేవిస్తున్నారు. కొంతమంది యువకులు స్నానాలకు వెళ్లే వారిని గురించి అసభ్యంగా మాట్లాడుతుంటారని అక్కడ పనిచేస్తున్న అర్చకులు చెబుతున్నారు.

గతంలో దాడి..

గతంలో ఇదే పుష్కర ఘాట్‌లో తెనాలి నుంచి వచ్చిన ఎనిమిది మంది కుటుంబ సభ్యులపై మందు బాబులు దాడి చేశారు. వారిలోని మహిళలను వివస్త్రను చేయగా, సకాలంలో పోలీసులు స్పందించడంతో ఆ దుండగులు అక్కడి నుంచి పరారయ్యారు. మద్యం సేవించిన వారు ఆ సీసాలను పుష్కర ఘాట్ల మెట్లపై పగల గొట్టటం, వాటిని ఇసుకలో పడవేస్తుండడంతో మత్స్యకారులతో పాటు భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం



కృష్ణానది ఎగువ ప్రాంతంలో మద్యం సేవించి సీసాలను పగలకొట్టి నీటిలోకి విసిరేస్తున్నారు. వలలు నీటిలో ఇరుక్కున్నప్పుడు, పడవలు తీసే సమయంలో ఆ పెంకులు కాళ్లకు గుచ్చుకుని ఇబ్బందులు పడుతున్నాం. పగలంతా కాపలా కాసినా రాత్రిళ్లు మద్యం బాబులు వచ్చి పడవల వద్ద మద్యం సేవిస్తున్నారు.

– అప్పారావు, నివాసితుడు

ఘాట్లలోనే సీసాలు పగలకొడుతున్నారు..



సీతానగరం పుష్కర ఘాట్‌లో రాత్రి, పగలు తేడా లేకుండా మద్యం సేవిస్తున్నారు. ఆ మత్తులో బాటిళ్లను విసిరేస్తున్నారు. సీసా పెంకులు పేరుకుపోతున్నాయి. మాంసానికి సంబంధించి ఎముకలు, ఇతర ఆహార పదార్థాలు అక్కడే పడవేయడంతో చాలామంది ఇబ్బంది పడుతున్నారు. అధికారులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి, వీటికి అడ్డుకట్ట వేయాలి.

– కొప్పనాతి శంకర్, స్థానికుడు

దేవాలయ ప్రాముఖ్యతను కాపాడాలి



సీతా నగరం పుష్కర ఘాట్లు ఆధ్యాత్మిక కేంద్రంగా పేరు గాంచింది. ఇలాంటి ప్రాంతంలో మద్యం సేవించి, మాసం తిని వాటిని అక్కడే పడవేయడం చాలా అపచారం. ఎంతో ప్రసిద్ధి గాంచిన ఈ పుష్కర ఘాట్లను పరిశుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత అందరిపై ఉంది. ఎవరైనా మద్యం బాబులకు ఇక్కడ తాగవద్దని చెబితే మాపై దాడిచేసేందుకు కూడా వెనుకాడడం లేదు. అధికారులు నిఘా ఏర్పాటు చేయాలి.

– వెంకటేశ్వరరావు, అయ్యప్ప భక్తుడు

వెలిగిన విద్యుత్ దీపాలు



సాక్షి ఎఫెక్ట్

తాడికొండ: వెలగని వీధి దీపాలు పేరిట ఈ నెల 28వ తేదీ ఆదివారం సాక్షిలో ప్రచురితమైన కథనానికి ఎట్టకేలకు అధికారులు స్పందించారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పోలీస్‌స్టేషన్ కూడలి నుంచి గాంధీ బొమ్మ వరకు అంధకారమయంగా ఉన్న వీధి దీపాలను పంచాయతీ ఆధ్వర్యంలో కార్యదర్శి హరిబాబు మరమ్మతులు చేయించారు. పాడైపోయిన విద్యుత్ తీగెల స్థానంలో కొత్త తీగెలను వేయించి, లైట్లు వెలిగించారు. 4 నెలలుగా వెలగని ప్రధాన రహదారి విద్యుత్ దీపాల సమస్య పరిష్కారం కావడంతో స్థానికులు ఆనందం వ్యక్తంచేశారు.

హై రిస్క్ ప్రెగ్నెన్సీపై నేడు అవగాహన

ఫిరంగిపురం: హై రిస్క్ ప్రెగ్నెన్సీపై ఆరోగ్య సిబ్బందికి బుధవారం మండలంలోని నుదురుపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎన్‌సీడీసీడీ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ శ్రావణ్‌బాబు మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఢిల్లీకి చెందిన ఆర్మన్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ శిక్షణ కార్యక్రమానికి నుదురుపాడు, ఫిరంగిపురం. మేడికొండూరు, పలకలూరు, మందపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు చెందిన ఆరోగ్య సిబ్బంది పాల్గొంటారని చెప్పారు. క్షేత్రస్థాయిలో సిబ్బందికి హైరిస్క్ ప్రెగ్నెన్సీల గురించి పూర్తి వివరాలను శిక్షణలో డాక్టర్ చరణ్ తెలియజేస్తారన్నారు. శిక్షణకు వచ్చే సిబ్బంది ఏఎన్‌సీల హైరిస్క్ పుస్తకాన్ని తమ వెంట తీసుకురావాలని చెప్పారు. ఆయన వెంట వావిలాల సీతారామ శాస్త్రి ఉన్నారు.

పటేల్ జీవితం ఆదర్శప్రాయం



ప్రతిజ్ఞ చేయిస్తున్న విద్యార్థులు

తాడేపల్లిరూరల్ : సర్దార్ వల్లభాయ్ పటేల్ జీవితం నేటి తరానికి ఆదర్శప్రాయమని కేఎల్ యూనివర్సిటీ విద్యార్థి విభాగాధిపతి డాక్టర్ కేఆర్ఎస్ ప్రసాద్ అన్నారు. మంగళవారం దుగ్గిరాల మండల పరిధిలోని పెదపాలెం జెడ్పీ పాఠశాలలో కేఎల్‌యూ సీఎస్ఈ ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సీహెచ్ నాగమణి మాట్లాడుతూ దేశ ఐక్యత, సమగ్రత, భద్రతా భావాన్ని పాటించాలని పాఠశాల విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ స్వాతంత్ర్యానంతరం పలు సంస్థానాలను దేశంలో విలీనం చేయడంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ కృషి ఎనలేనిదన్నారు. భారత రాజ్యాంగ రచనలో ప్రముఖ పాత్ర పోషించారని, దేశ విభజన అనంతరం జరిగిన అల్లర్లను చాకచక్యంగా అణచివేసారని విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామారావు, వర్సిటీ వీసీ డాక్టర్ జి. పార్థసారథి వర్మ, ప్రో వీసీలు డాక్టర్ ఎవిఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్. వెంకట్రామ్, డాక్టర్ కె. రాజశేఖరరావు, డీన్ డాక్టర్ హబీబుల్లా ఖాన్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ పి. శ్రీకాంత్ రెడ్డి, ఫీల్డ్ కో ఆర్డినేటర్ పి. సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాద రహితంగా దీపావళిని జరుపుకోవాలి

- సబ్‌కలెక్టర్ సంజనా సింహ
- బాణ సంచా స్టాల్స్ లాటరీ పద్ధతిలో కేటాయింపు



స్టాల్స్ కేటాయింపునకు లాటరీ తీస్తున్న సబ్ కలెక్టర్ సంజనా సింహ

తెనాలి: దీపావళిని ప్రజలు సంతోషంగా జరుపుకోవాలని తెనాలి సబ్‌కలెక్టర్ వి.సంజనా సింహ ఆకాంక్షించారు. బాణసంచా కాల్చేటపుడు తగిన జాగ్రత్తలు తీసుకుని ప్రమాదరహితంగా జరుపుకోవాలని సూచించారు. వ్యాపారులు నిర్ణీత ప్రదేశంలో వారికి కేటాయించిన స్టాల్స్‌లో ప్రభుత్వ నిబంధనల ప్రకారం బాణ సంచా విక్రయాలు చేపట్టాలని స్పష్టంచేశారు. అగ్నిప్రమాద నివారణ జాగ్రత్తలను తప్పనిసరిగా అమలుచేయాలన్నారు. స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం మధ్యాహ్నం బాణసంచా వ్యాపారులకు విక్రయ స్టాల్స్‌ను లాటరీ పద్ధతిలో కేటాయించారు. వ్యాపారుల సమక్షంలో సబ్‌కలెక్టర్ వి.సంజనా సింహ లాటరీ తీశారు. ఈసారి బాణసంచా విక్రయాలకు తెనాలి–విజయవాడ రోడ్డులోని వీఎస్సార్ అండ్ ఎన్వీఆర్ కాలేజి మైదానాన్ని ఎంపిక చేశామని చెప్పారు. ప్రమాదాలకు ఆస్కారం లేకుండా ఉంటుందనే ఆ ప్రదేశాన్ని ఎంపిక చేసినట్టు తెలిపారు. బాణసంచా విక్రయాల కోసం 50 మంది దరఖాస్తు చేశారనీ, వారందరికీ తాత్కాలిక లైసెన్సులు మంజూరు చేశామన్నారు. లాటరీ పద్ధతిలో ఇప్పుడు స్టాల్స్ నంబర్లను కేటాయించినట్టు చెప్పారు. దీపావళి రోజు సాయంత్రం నాలుగు గంటల వరకు వారు విక్రయాలు చేసుకోవచ్చని తెలిపారు. లైసెన్సుదారుల కోరికపై, తోపుడుబండ్లపై పట్టణ వీధుల్లో, మరే ప్రదేశంలోనైనా బాణసంచా విక్రయాలకు ఆస్కారం లేకుండా చూస్తామని సబ్‌కలెక్టర్ చెప్పారు. ఆ ప్రకారం సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీచేస్తామన్నారు. లాటరీ కార్యక్రమంలో తెనాలి మండల తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ ఉన్నారు.

'కూటమి'గా మట్టి తరలింపు

- అత్తోట గ్రామ శివారులో రహదారి వెంట మట్టి తరలింపు
- చోద్యం చూస్తున్న అధికారులు



ఆర్అండ్‌బీ రోడ్డు మార్జిన్ లో అక్రమంగా మట్టిని తీస్తున్న దృశ్యం

అత్తోట(కొల్లిపర): కూటమి నాయకుడొకరు రోడ్డు ఇరుప్రక్కల ఉన్న మట్టిని అక్రమంగా సచివాలయం వద్దకు తరలించటం మంగళవారం పట్ట పగలు చోటు చేసుకుంది. మండల పరిధిలోని అత్తోట నుంచి నందివెలుగు వెళ్లే ప్రధాన ఆర్అండ్‌బీ రహదారిలో అధికారులు ఎవరు లేకుండా గుట్టు చప్పుడు కాకుండా చేస్తున్న ఈ వ్యవహారంపై పలువురు గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామ శివారులో పధాన రహదారిలో ఇరుప్రక్కల మట్టిని తీసి సుమారు 15 ట్రాక్టర్లు సచివాలయం వద్ద ఖాళీ స్థలంలో మట్టి తరలించడంపై వారంతా ప్రశ్నిస్తున్నారు. రోడ్డు మార్జిన్‌లో ఉన్న మట్టిని ఈ విధంగా తరలిస్తే వర్షాలు వచ్చిన సమయంలో మార్జిన్ ఉండదని అటు వంటి సమయంలో రోడ్డు గుంటలు పడి ప్రమాదాలకు దారి తీస్తుందని వారంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా మట్టి తరలించే సమయంలో అక్కడ ఒక్క అధికారి కూడా లేకపోవండంతో ప్రజలకు అనేక అనుమానాలు తావిస్తోంది. దీనిపై ఆర్అండ్‌బీ ఏఈ నరసింహా రావు, ఎంపీడీవో విజయలక్ష్మికి ఫోన్ చేయగా వారికి ఈ విషయం తెలియదన్నారు. వెంటనే సిబ్బందిని పంపించి మట్టి తరలించే ప్రక్రియను నిలిపివేస్తామని తెలిపారు. సమాచారం అందుకున్న గ్రామ కార్యదర్శి సంఘటన స్థలానికి వచ్చి అనుమతులు లేకుండా మట్టి తరలించటం నేరమనిఅక్కడ ఉన్న కూట మి పార్టీ నాయకులు, నిర్వాహకులకు స్పష్టం చేశారు. అయితే ఆమె మాట వినకుండా మట్టి తరలించటంతో తిరిగి ఉన్నతాధికారులకు సమాచారం అందించి అక్కడి నుంచి వెళ్లిపోయారు. అనంతరం కొంత సమయానికి ఆర్అండ్‌బీ సిబ్బంది వచ్చి అక్రమ మట్టి తరలింపును నిలిపివేశారు. ముందు ముందు ఇటువంటి సంఘటనలు జరగకుండా అధికారులు తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

'చలపతి'లో డేటా సైన్స్‌పై వర్క్ షాప్



మోతడక(తాడికొండ): మోతడక చలపతి ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం బిగ్ డేటాపై కంప్యూటర్ సైన్స్‌- డేటా సైన్స్ విభాగం విద్యార్థులకు సీనియర్ సాఫ్ట్‌వేర్ కన్సల్టెంట్ ఎం.అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో ఆవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిగ్ డేటా ద్వారా ప్రస్తుత ఇండస్ట్రీకి అవసరమయ్యే వివిధ నైపుణ్య అంశాలు వాటి ఉపయోగాలు విద్యార్థులకు వివరించారు. అనంతరం అతిథి అరుణ్ కుమార్‌ను ప్రిన్సిపల్ డాక్టర్ కె నాగ శ్రీనివాసరావు, డీన్లు ఘనంగా సత్కరించారు. కళాశాల డీన్ల్ డాక్టర్ పి.ఫణికుమార్, డాక్టర్ వీవీ సుబ్బారావు, డాక్టర్ పి.బాల మురళీ కృష్ణ, డేటా సైన్స్ హెచ్‌వోడీ వి.సాయి శ్రీనివాసరావు, ఫ్యాకల్టీ డి.లావణ్య, డి.రోజా, కె.హరిత, ఎస్కే ఖాదర్ బాషా, టి.హరినాథ్ పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్లపై వ్యర్థాలు లేకుండా చూడాలి



తెనాలిఅర్బన్: రోడ్లపై వ్యర్థాలు లేకుండా చూడాలని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వి.ఎం.లక్ష్మీపతి సూచించారు. పట్టణంలోని 4వ శానిటరీ డివిజన్ కార్యాలయాన్ని మంగళవారం తనిఖీ చేశారు. అటెండెన్స్ పరిశీలించారు. అనతంరం పలు వార్డుల్లో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యర్థాల నిర్వహణపై పలు విమర్శలు వినిపిస్తున్నాయని, అలాంటివి రాకూండా చూసుకోవాలని తెలిపారు. ప్రతిరోజు చెత్త సేకరణను చేయాలని ఆదేశించారు. ఆయన వెంట పలువురు సచివాలయం, మున్సిపల్ ఉద్యోగులు ఉన్నారు.

క్రీడాస్ఫూర్తి కలిగి ఉండండి

తెనాలిఅర్బన్: క్రీడాస్ఫూర్తి అందరూ కలిగి ఉండాలని టుటౌన్ ఎస్ఐ షరీఫ్ పేర్కొన్నారు. బుర్రిపాలెం రోడ్డులోని భాష్యం స్కూల్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన క్రీడలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల ద్వారా మానసిక ఉల్లాసం లభిస్తుందని చెప్పారు. అలాగే క్రీడల్లో రాణిస్తే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ రాము, వైస్ ప్రిన్సిపల్ మోహన్‌దాస్, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

తాడికొండ: కడుపునొప్పి తాళలేక పురుగు మందు తాగిన యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన కంతేరు గ్రామంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన ఆలా కోటేశ్వరరావు (19) అనే యువకుడు గత కొంత కాలంగా కడుపు నొప్పితో బాధపడుతున్నాడు. ఇటీవల కాలంలో ఎక్కువ కావడంతో తాళలేక ఈ నెల18న గడ్డిమందు తాగాడు. గుంటూరులోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స అందిస్తుండగా మంగళవారం మృతి చెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కె.వాసు తెలిపారు.

సోలా ముత్యాలరావు ఆదర్శనీయం



ప్రసంగిస్తున్న సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు

తాడేపల్లిరూరల్ : సీపీఎం నేతగా వివిధ ప్రజా సంఘాల్లో పని చేసిన సోలా ముత్యాలరావు అభినందనీయులని సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు అన్నారు. మంగళవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని నెహ్రూ బొమ్మ సెంటర్‌లో సోలా ముత్యాలరావు సంస్మరణ సభను సీపీఎం పట్టణ నాయకులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన పాశం రామారావు పలువురు సీపీఎం నాయకులతో కలసి సోలా ముత్యాలరావు చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి ప్రస్థానం మొదలు పెట్టి యువజన సంఘం (డీవైఎఫ్ఐ)లో పనిచేసి, యువతీ యువకులను కూడగట్టి వారి హక్కుల కోసం పోరాడారన్నారు. సోలా మూత్యాలరావు స్ఫూర్తితో కేంద్రంలో, రాష్ట్రంలో పాలక పార్టీలు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిఘటిస్తామని అన్నారు. నాయకులు జొన్నా శివశంకరరావు, బూరుగ వెంకటేశ్వర్లు, దొంతిరెడ్డి వెంకట రెడ్డి, దొంతిరెడ్డి శ్రీనివాస్ కుమారి, ఎం.రవి, కాట్రగడ్డ శివరామ కృష్ణయ్య, కంచర్ల కాశయ్య, గాదె సుబ్బారెడ్డి, కొట్టే కరుణాకర్‌రావు, ఎం. భాగ్యరాజ్ పాల్గొన్నారు.

యువకుడిపై రౌడీషీటర్ దాడి



దగ్ధమైన బైక్

తెనాలిరూరల్: యువకుడిపై రౌడీషీటర్ దాడి చేయడమే కాకుండా అతని బైక్‌ను దగ్ధం చేసిన ఘటన సోమవారం రాత్రి పొద్దుపోయాక ఐతానగర్‌లో జరిగింది. బాధితుడు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. స్థానిక నాజరుపేటకు చెందిన కాకుమాను ఇంద్రజిత్ డెకరేషన్ పనులు చేస్తుంటాడు. ఇతని వద్ద పని చేసే యువకుడిని ఐతానగర్‌లో దింపి, సామానును గోడౌన్‌లో పెట్టేందుకు బైక్‌పై వెళ్లాడు. పని చేసే కుర్రాడిని దింపి తిరిగి వస్తుండగా ఐతానగర్ బీఎస్ఏ సెంటరులో తెలిసిన వ్యక్తి కనబడితే పలుకరించి వెళ్లాడు. రౌడీషీటర్ సముద్రాల పవన్ కుమార్ అలియాస్ లడ్డు ఇతని వాహనాన్ని వెంబడించి డాంగే వారి వీధి సమీపంలో అడ్డగించి, తనను పలుకరించకుండా వెళతావా అంటూ ఇంద్రజిత్‌పై రాయి, చేతులు, కాళ్లతో దాడి చేసి గాయపర్చాడు. అంతటితో ఆగకుండా బాధితుడి బైక్‌ను బీఎస్ఏ సెంటరు సమీపంలోకి తీసుకెళ్లి నిప్పంటించాడు. ఇంద్రజిత్ గాయాలతో తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. రౌడీషీటర్ కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలిస్తున్నట్లు పోలీసులు మంగళవారం తెలిపారు.

చేనేత వస్త్రాల తయారీపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న చేనేత కార్మికులు

తాడేపల్లిరూరల్ : దుగ్గిరాల మండలం రేవేంద్రపాడు జిల్లా పరిషత్ పాఠశాలలో 9, 10 తరగతులు చదువుతున్న విద్యార్థులకు మంగళగిరిలో తయారు చేసే చేనేత వస్త్రాల తయారీపై మంగళవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఒకేషనల్ ఉపాధ్యాయురాలు కల్యాణి మాట్లాడుతూ మంగళగిరి చేనేత వస్త్రాలు తయారు చేసే విధానంపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు మంగళగిరి చేనేత వస్త్రాలు తయారు చేసే ప్రాంతానికి తీసుకు వచ్చామని, చేనేత కార్మికులు వస్త్రాలు తయారు చేయడానికి నూలు వడకడం దగ్గర నుంచి రంగులు అద్దడం, రంగులు అద్దిన నూలు పోగులను విడదీయడం, వాటిని దుస్తులుగా మార్చే విధానంపై పూర్తి వివరాలు చేనేత కార్మికుల ద్వారా విద్యార్థులకు వివరించామని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు సుజాత, ఝాన్సీ, శాంతి, సుశీల పాల్గొన్నారు.